సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 21 । మార్చి । 2025



సునీతా విలియమ్స్‌కు అభినందన

విశాఖ: అంతరిక్షం నుంచి భూమికి చేరుకున్న సునీత విలియమ్స్‌కు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.



వాల్తేర్ డివిజన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

వాల్తేర్ డివిజన్ పరిధిలో దువ్వాడ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్లలో డీఆర్‌ఎం లలిత్ బోరా గురువారం తనిఖీలు నిర్వహించారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	శుక్ర	శని
అనకాపల్లి	6.12	4.45
నర్సీపట్నం	6.14	4.43

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు విడుదల

విశాఖ విద్య: ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను ప్రకటించినట్లు డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఐఎస్‌లో నమోదైన వివరాల మేరకు వీటిని వెల్లడించామన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఈ నెల 24 సాయంత్రం 5గంటల్లోపు విశాఖపట్నంలోని డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. గడువు తర్వాత అందిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోమని స్పష్టం చేశారు. అందిన అభ్యంతరాలపై జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి, తుది నిర్ణయం తీసుకుంటుందని, ఆ మేరకు ఫైనల్ సీనియార్టీ జాబితా ప్రకటిస్తామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దీన్ని గమనించి, జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు.

ఐఐఎంవీలో నూరుశాతం ప్లేస్‌మెంట్స్



ఐఐఎంవీ స్టూడెంట్స్ ప్లేస్‌మెంట్ కమిటీ

తగరపువలస: ఐఐఎంవీ 2024–2026 బ్యాచ్ నూరుశాతం నియామకాలతో వేసవిని విజయవంతంగా ముగించినట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ గత రికార్డులు అధిగమించి విద్యార్థులకు ఏమి అవసరమో అదే బోధించబడుతుందన్నారు. ఇందుకు తమ అధ్యాపకులు అభినందనీయులన్నారు. దేశంలోని ప్రముఖ రిక్రూటర్లు తమ విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించడం తమకు గర్వకారణమన్నారు. వేసవి ప్లేస్‌మెంట్ ప్రక్రియలో 344 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. 130 మంది రిక్రూటర్లు తమ నియామక జాబితాలో చేరారన్నారు. వీరిలో 77 మంది కొత్తగా తమతో భాగస్వామ్యం పొందారన్నారు. కెరీర్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ చైర్‌పర్సన్ దీపికాగుప్తా మాట్లాడుతూ ప్రపంచ వాతావరణంలో కొనసాగుతున్న అనిశ్చితి, సందిగ్ధత కారణంగా ఈ వేసవి ఆందోళన కలిగించినా అంచనాలు అధిగమించి నూరు శాతం ఫలితాలు సాధించామన్నారు. గత ఏడాదితో పోలిస్తే స్టైఫండ్‌లో 45.83 శాతం పెరిగిందన్నారు.

రుషికొండ బీచ్‌లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీ టూరిజం ఎండీ ఆమ్రపాలి

కొమ్మాది : రుషికొండ బీచ్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి గురువారం పరిశీలించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టూరిజం అధికారులకు సూచించారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులు నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట ఆర్డీ జగదీష్, ఏఎం ఓహెచ్ కిషోర్ తదితరులు ఉన్నారు.

ప్రధాని యోగా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ప్రధాన మంత్రి యోగా పురస్కారాలకు కేంద్రం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని సెట్విన్ విశాఖపట్నం ముఖ్యకార్య నిర్వాహణ అధికారి ఎం.సత్యపద్మ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధికి కృషిచేసి, కనీసం యోగా రంగంలో 20 ఏళ్ల అనుభవం, అద్భుతమైన ట్రాక్ రికార్డ్ ఉన్న వారు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నా రు. https://innovateindia.mygov. in/mygov.in/pm&yoga&awards&2025 పోర్టల్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాబితాను అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 21న ప్రకటిస్తారని తెలిపారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయి సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 104 అంశాలు సభ్యుల ముందుకు చర్చకు రానున్నాయి. పలు అభివృద్ధి అంశాలతో పాటు ఉద్యోగుల సర్వీస్ అంశాలు చర్చకు రానున్నాయి.

- కూటమి పాలకుల నిర్లక్ష్యం.. ‘గోవాడ’కు శాపం
- నిధులు తెస్తామని ముఖం చాటేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- ఒక్క రూపాయి కూడా సాయం చేయని కూటమి ప్రభుత్వం
- ఫ్యాక్టరీ మనుగడపై చెరకు రైతులు, కార్మికుల్లో ఆందోళన
- నేడు రైతు సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా

‘మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆర్థికంగా ఆదుకుంటాం.. ఉప ఉత్పత్తుల యూనిట్లు నెలకొల్పి ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తాం...చెరకు టన్నుకి రూ.4 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తాం...’ అంటూ ఎన్నికల నాడు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో మీటింగ్‌లు పెట్టి మరీ చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన సాయం కంటే ఒక రూపాయి అయినా ఎక్కువ తెస్తామని గత సెప్టెంబర్‌లో జరిగిన ఫ్యాక్టరీ మహాజనసభలో ప్రకటించారు. హామీలు కోటలు దాటాయి...కానీ...చేతలు ఫ్యాక్టరీ గేటు కూడా దాటలేదు. గడిచిన పదినెలల్లో కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఫ్యాక్టరీకి సాయం అందివ్వలేదు.

■ చక్కెర ఫ్యాక్టరీ చేదైందా..!

తియ్యని మాటలు... చెరిగిన బాసలు



చోడవరం :

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మనుగడపై రైతులు, కార్మికుల్లో ఆందోళన నెలకొంది. సాయం చేస్తుందనుకున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా సాయం చేయకపోగా ఫ్యాక్టరీని అభివృద్ధి చేసేస్తామని చెప్పిన కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు ఫ్యాక్టరీ చుట్టుపక్కలకే కనిపించకుండా పోయారు. ఇంతటి దయనీయ పరిస్థితుల మధ్య మేము ఈ చెరకు పంట వేయలేమంటూ తన పొలంలో సొంతంగా వేసుకున్న చెరకు పంటనే దేవరాపల్లి మండలంలో ఒక రైతు తోటకు నిప్పంటించుకుని తన నిస్సహాయతను వ్యక్తం చేసిన సంఘటనలూ చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు, ప్రభుత్వ నిరంకుశ పాలనను ఎత్తిచూపేందుకు రైతు సంఘాలు ఆందోళన బాట పట్టాయి. దీనిలో భాగంగా ఈనెల 21వ తేదీన శుక్రవారం ఫ్యాక్టరీ వద్ద మహాధర్నాకు రైతన్నలకు పిలుపునిచ్చాయి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌లో ఎదురవుతున్న సమస్యలు మరింతగా కుంగదీస్తున్నాయి. మరో పక్క ఫ్యాక్టరీని, చెరకు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, నాయకులు చేతులెత్తేయడంతో ఇప్పుడు ఫ్యాక్టరీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రైతులకు చెరకు పేమెంట్స్ ఇవ్వలేక, కార్మికులకు జీత భత్యాలు చెల్లించలేక, పాత బకాయిలు చెల్లించలేక, క్రషింగ్‌కు కావలసిన సామాగ్రికి అవసరమైన ఆర్థిక స్థోమత లేక ఫ్యాక్టరీ చాలా దయనీయంగా ఉంది. 23, 450 మంది సభ్యరైతులు ఉన్న ఈ ఫ్యాక్టరీ నేడో రేపో మూసివేసే దుస్థితికి రావడం రైతులను, కార్మికులను ఆందోళనకు గురిచేస్తుంది. 2019 సంవత్సరానికి ముందు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఫ్యాక్టరీ పాలకమండలిలో ఉన్న టీడీపీ పాలకవర్గం సుమారు రూ. 150 కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టింది. అప్పట్లో అధికారంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కనీసం ఒక్క రూపాయి కూడా ఫ్యాక్టరీకి ఆర్థిక సాయం అందించలేదు. దీంతో ఫ్యాక్టరీ పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఫ్యాక్టరీని ఆదుకుంది. ప్రభుత్వ విప్ హోదాలో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఉపముఖ్యమంత్రిగా బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖామంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ ఈ ఫ్యాక్టరీని కాపాడటానికి ఎంతో కృషిచేశారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించి ఐదేళ్లలో రూ. 89 కోట్లు ఆర్థిక సాయం అందించారు. ఎక్కడా అప్పుతేకుండా ఉత్పత్తి అయిన పంచదార, ఇతర ఉత్పత్తులు అమ్మకాలతో వచ్చిన డబ్బులతో రైతులకు పేమెంట్స్ ఇచ్చి కొత్త అప్పులు లేకుండా గడిచిన ఐదేళ్లలో ఫ్యాక్టరీని నడిపారు. దీంతో పూర్తిగా నిర్వీర్యం అయిపోయిన గోవాడ ఫ్యాక్టరీ నెమ్మదిగా అప్పుల ఊబిలొంచి కొంతమేర బయటపడింది. అయితే 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫ్యాక్టరీకి మళ్లీ గడ్డు పరిస్థితులు మొదలయ్యాయి.

గత ప్రభుత్వం ఎనలేని ‘సహకారం’

రాష్ట్ర సహకార రంగంలో 11 సుగర్ ఫ్యాక్టరీల్లో అన్నీ ఇప్పటికే మూతబడి పోగా ఒక్క గోవాడ ఫ్యాక్టరీ మాత్రమే నడుస్తోంది. ఈ ఫ్యాక్టరీకి కనీసం రూ.9 కోట్లు సాయం అందించి, ఫ్యాక్టరీని, రైతులను ఈ కూటమి ప్రభుత్వం ఆదుకోలేకపోవడంపై చెరకు రైతులు ఆగ్రహంతో ఉన్నారు. గత జగన్ ప్రభుత్వ పాలనలో 4 ఫ్యాక్టరీలకు సుమారు రూ.200 కోట్లు వరకూ ఆర్థికసాయం అందించి, కార్మికులు, రైతుల పాతబకాయిలన్నీ చెల్లించారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీ విషయంలో అయినా ఎందుకు స్పందించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీస్తున్నారు...ఫ్యాక్టరీ మనుగడ కోసం, ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతులంతా ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

నేడు చెరకు రైతుల మహాధర్నా:

ఫ్యాక్టరీని, చెరకు రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన చెరకు రైతులు ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏపీ చెరకు రైతు సంఘం, ఏపీ రైతుసంఘం, ఏపీ రైతు కూలీ సంఘం , ఏపీ వ్యవసాయ రైతు కూలీసంఘం, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టనున్నారు. ఈ ఆందోళనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పాల్గొననున్నారు. ఇప్పటికే తమ ప్రచార బృందాలతో ఆటోలతో ఫ్యాక్టరీ పరిధిలో ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం కూడా చేశారు.



మాడుగుల ఎమ్మెల్యే బండారు | చోడవరం ఎమ్మెల్యే రాజు | అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

ఫ్యాక్టరీ గోడు పట్టదా?..

ఇప్పుడు జనవరి నెలలో ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్ ప్రారంభమైంది. ఎప్పుడో 1962లో 1000 టన్నుల కెపాసిటీతో స్థాపించిన ఈ ఫ్యాక్టరీ దశలవారీగా కెపాసిటీ స్థాయి పెంచుకుంటూ ప్రస్తుతం 5.2లక్షల టన్నుల క్రషింగ్ కెపాసిటీకి వచ్చింది. కానీ మిషనరీ అంతా 30, 40యేళ్ల కిందటిది కావడంతో పాత మిషనరీతో తరచూ క్రషింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓవర్‌హాలింగ్ సమయంలో అవసరమైన కొత్తమిషనరీ పార్టులు తెచ్చి బిగించే వారు. ఈ ఏడాది నిధులు లేక నామమాత్రంగా ఉన్నంతలో ఓవర్‌హాలింగ్ పూర్తి చేసి క్రషింగ్‌కు దిగారు. దీంతో క్రషింగ్‌లో పాత మిషనరీ పరికరాలు ఒక్కొక్కటిగా మరమ్మతులకు గురై తరుచూ అంతరాయం కలుగుతోంది. రైతులు తెచ్చిన చెరకు కాటాల వద్ద ఎండిపోయి బరువు తగ్గిపోయి రైతులకు టన్నేజీ తగ్గిపోయి నష్టం కలుతుతోంది. అత్యవసరంలో రూ. 9 కోట్లు ప్రభుత్వం సాయంగా అందిస్తే తప్ప తాత్కాలికంగా ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బంది నుంచి గట్టెక్కలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో చెరకు రైతులంతా కూటమి నేతల వంచనపై ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

పన్నుకు ఎగనామం

- రైతుల పేరిట సరకు రవాణా
- చెక్ పోస్టుల్లో కొరవడిన నిఘా



బలిఘట్టం వద్ద మార్కెట్ యార్డు చెక్ పోస్టు

నర్సీపట్నం : వ్యవసాయ ఉత్పత్తులు దొడ్డిదారిన సరిహద్దు దాటిస్తున్నారు. వ్యాపారులే రైతుల అవతారమెత్తి సెస్సుకు ఎగనామం పెడుతున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన పంటలకు మార్కెట్ ఫీజుగా వ్యాపారి 1 శాతం చెల్లించాలి. అప్పుడే ఇతర ప్రాంతాలకు తరలించడానికి వీలుంటుంది. రైతుల పేరుతో తీసుకెళ్లే సరుకుకు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. దీంతో రెవెన్యూ సిబ్బంది చేయి తడిపి పంట ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. వరి ధాన్యం, అపరాల పంటలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పంట ఉత్పత్తులను తరలిస్తున్న వాహనాలను చెక్ పోస్టుల వద్ద పక్కాగా తనిఖీ చేయాలి. వాహనంలో ఎంత విలువైన సరకు ఉందో అంచనా వేయాలి. కానీ తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది ఇవేవీ పట్టించుకోవడం లేదు.

రూ.2 కోట్ల సెస్ వసూళ్ల లక్ష్యం..

నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి రూ.2 కోట్లు సెస్సు వసూలు చేయాలనేది లక్ష్యం. దీనిపై సిబ్బంది దృష్టి సారించడం లేదు. మార్కెట్ యార్డు పరిధిలో ఎనిమిది చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2 కోట్లు సెస్సు వసూలు చేయాల్సి ఉంది. ఈ నెల 17 నాటికి రూ. 1.24 కోట్లు ఆదాయం గతేడాది ఇదే సమయానికి రూ.1.56 కోట్ల ఆదాయం వచ్చింది. వీటి నుంచి సెస్సు వసూలు చేయాల్సి ఉండగా రూ.1.24 కోట్లు వసూలు చేయడం గమనార్హం. ఆయా తనిఖీ కేంద్రాల్లో వద్ద సిబ్బంది ఇవేవీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

సిబ్బంది కొరత...

ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి భువనేశ్వరిని వివరణ కోరగా మార్కెట్ పరిధిలో బలిఘట్టం, గన్నవరంమెట్ట, రాజుపేట వద్ద చెక్‌పోస్టులు ఉన్నాయని, ప్రతి చెక్‌పోస్టును క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని అన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే ఊరుకునేదిలేదని చెప్పారు. సిబ్బంది కొరత ఉందని, దొడ్డిదారిన ఉత్పత్తులు తరలింపును అరికట్టేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

8న అప్పన్న వార్షిక కల్యాణోత్సవం

ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈవో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: అన్ని శాఖల సమన్వయంతో వచ్చే నెల 8న జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు తెలిపారు. వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై సింహగిరిపై గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల 8న రాత్రి 8 గంటల నుంచి స్వామి రథోత్సవం, 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం జరుగుతుందని ఈవో తెలిపారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య శిబిరాల నిర్వహణ, రవాణా, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, సీఐ అప్పారావు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

వీఆర్పీగా కొనసాగాలంటే రూ. 5 లక్షలివ్వాలన్నారు...!

- కూటమి నాయకులు నన్ను తొలగించాలని చూస్తున్నారు..
- పీడీకి మొరపెట్టుకున్న బట్లపూడి వీఆర్పీ లలిత



కూటమి నాయకుల వత్తిడిని పీడీ పూర్ణిమదేవికి చెబుతున్న బట్లపూడి వీఆర్పీ లలిత

తుమ్మపాల : ఉపాధి హామీ పథకంలో వీఆర్‌పీగా కొనసాగాలంటే రూ.5 లక్షల మామూళ్లు ఇవ్వాలని కూటమి నాయకులు వత్తిడి చేసి తనను తొలగించాలని చూస్తున్నారని బట్లపూడి వీఆర్‌పీ లలిత డ్వామా పీడీ పూర్ణిమదేవి, ఏపీడీ మణికుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో నరసింహరావు, ఇతర అధికారులు ముందు మొరపెట్టుకుంది. ఉపాధి హామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన తనిఖీల వివరాలను డీఆర్పీలు బహిరంగంగా చదివి వినిపించారు.

బట్లపూడిలో జరిగిన 2023–24 ఉపాధి హామీ పనులపై పలు ఆరోపణలను డీఆర్పీ చదవడంతో పీడీ పూర్ణిమాదేవి వీఆర్పీని ప్రశ్నించారు. దీంతో వీఆర్పీ లలిత సమాధానం చెప్తూ కూటమి నాయకుల వత్తిడితోనే ఉపాధి కూలీలు తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, కూటమి నాయకులు చెప్పినట్టు చేస్తే తనపై ఎటువంటి ఆరోపణలు లేకుండా చేస్తామన్నారని, వారు అడిగినంత ఇవ్వలేకపోవడంతో తనపై కక్ష కట్టి తొలగించాలని చూస్తున్నారని బహిరంగంగా తెలిపింది. దీంతో పీడీ కల్పించుకుని ఇలాంటి అంశాలు తమ వద్ద ప్రస్తావించవద్దని హెచ్చరించి ఆ గ్రామ అంశాలను ముగించారు. మండలంలో మారేడుపూడి, దిబ్బపాలెం, ఊడేరు పలు గ్రామాల్లో వేతనదారుల మస్టర్ రిజిస్టర్‌లో దిద్దుబాట్లు చేసినట్టు గుర్తించామన్నారు. గైర్హాజరు వివరాలను హాజరైనట్టు దిద్దుబాట్లు చేశారని, కొన్ని చోట్ల చేసిన పనుల వివరాలపై నోటీస్ బోర్డులు లేవన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఎం.బుక్ లేకుండానే పేమెంట్లు చేసినట్టు గుర్తించామని డీఆర్పీలు చదివి వినిపించారు.

రేబాకలో ఉపాధి పనుల వివరాలను డీఆర్పీ చదవడం మొదలు పెట్టిన వెంటనే వీఆర్పీ రమాదేవి కళ్లు తిరిగి సొమ్మసిల్లిపోయింది. మధ్యాహ్నం వరకు జరిగిన సభలో ఏపీఎం సుప్రియతో పాటు పంచాయతీరాజ్ ఏఈ బాలాజీ, పలు శాఖల అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు, వేతనదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పేరు తొలగింపులో కుట్ర

- క్రికెట్ స్టేడియం వద్ద వైఎస్సార్ సీపీ ధర్నా
- ఏసీఏ 48 గంటల్లో సమాధానం చెప్పాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, తైనాల, చింతలపూడి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

సాక్షి, విశాఖపట్నం : పీఎంపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించేందుకు చేస్తున్న కుట్రను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ హెచ్చరించారు. స్టేడియం ఆధునీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఎంట్రన్స్ ఆర్చ్‌పై వైఎస్సార్ పేరు తొలగింపునకు నిరసిస్తూ గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తొలుత మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం , అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లతో కలిసి ఆయన స్టేడియం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నల్ల రిబ్బన్లతో ఆందోళన చేశారు. అక్కడ ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆనవాళ్లను తుడిచేయాలని సీఎం చంద్రబాబు అనుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. 2009 సెప్టెంబర్ 14న అప్పటి ఏసీఏ అధ్యక్షుడు గోకరాజు గంగారాజు ఆధ్వర్యంలో ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంగా మార్చినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ మార్క్, బ్రాండ్ కనబడకూడదనే కుట్రతోనే పేరును తొలగిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన సీతకొండ వ్యూ పాయింట్‌కు వైఎస్సార్ పేరు పెడితే దాన్ని తొలగించారని మండిపడ్డారు. విశాఖ ఫిల్మ్‌నగర్ క్లబ్ లాన్‌కు వైఎస్సార్ పేరు తొలగించారని, ఇవే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక చోట్ల వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం చేశారన్నారు.

ముఖ్య నాయకులకు బెదిరింపు

అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద వైఎస్సార్ సీపీ ఆందోళన చేయనున్న నేపథ్యంలో బుధవారం అర్థరాత్రి నుంచే వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్పొరేటర్లకు పోలీసులు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. నిరసన కార్యక్రమానికి ఎవరినైనా తీసుకెళ్తే అరెస్ట్ చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

నిరసనలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, శోభా హైమావతి, నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయచంద్ర, పార్టీ ముఖ్య నాయకులు రొంగలి జగన్నాథం, కొండా రాజీవ్‌గాంధీ, మొల్లి అప్పారావు, వుడా రవి, జహీర్ అహ్మద్, గండి రవి, శోభాస్వాతి రాణి, కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, అక్కరమాని పద్మరాము నాయుడు, డొలపల్లి ఏడుకొండలరావు, కోరుకోడ వెంకట రత్న స్వాతి దాస్, పద్మా రెడ్డి, బిపిన్ కుమార్ జైన్, కె.వి.శశికళ, గుడివాడ అనూష, ఇమ్రాన్, జిల్లా కార్యవర్గం కమిటీ, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు బోని బంగారు నాయుడు, నడింపల్లి కృష్ణంరాజు, చెన్నా జానకీరామ్, ముప్పల సురేష్, ద్రోణంరాజు శ్రీవాస్తవ్, బింగి హరి కిరణ్ రెడ్డి, పల్లా దుర్గారావు, మనలత జాబ్దాస్ (చిన్ని), పేడాడ రమణి కుమారి, వంకాయల మారుతీ ప్రసాద్, పీలా కిరణ్ జగదీష్, రామారెడ్డి, రాయపు అనిల్ కుమార్, లావణ్య చిమట, శెట్టి రోహిణి, పిల్లి సుజాత, పిల్లా సుజాత, అల్లంపల్లి రాజబాబు, మాధవీవర్మ, మజ్జి వెంకట రావు, బంకు సత్య, పోలిరెడ్డి, శ్రీదేవి వర్మ, రాజేశ్వరి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏలో తిష్ట వేసిన టీడీపీ ఎంపీల ఒత్తిడితోనే..

వైఎస్సార్ పేరును ఏసీఏ తొలగించిందా? లేదంటే కూటమి ప్రభుత్వం ఒత్తిడితో తొలగించారా? 48 గంటల్లో సమాధానం చెప్పాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏసీఏలో రెండు కీలక పదవుల్లో టీడీపీకి చెందిన ఎంపీలు ఉన్నందునే ఈ దుర్మార్గానికి ఒడిగట్టారనేది స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం రాజకీయ పదవుల్లో ఉన్నవారు క్రికెట్ అసోసియేషన్‌లకు బాధ్యత వహించకూడదనేది ఉందని, దానిని కూడా ఉల్లంఘించి టీడీపీ ఎంపీలు ఏసీఏలో తిష్టవేశారన్నారు.

గుర్తులు చెరిపేయాలనే..

కూటమి ప్రభుత్వం వైఎస్సార్ పేరును చూస్తేనే ఉలిక్కిపడుతోందని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దారన్నారు. ఆయన కృషిని గుర్తించి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఈ ప్రాంతంలో స్టేడియంకు వైఎస్సార్ పేరు పెడితే ఇప్పుడు దానిని కూడా తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారన్నారు.

క్లుప్తంగా

జ్యోతిష్య సిద్ధాంతి తమ్మిరాజుకు అవార్డు


శ్యామ్ కుమార్ శర్మ

అనకాపల్లి టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య సిద్ధాంతి తమ్మిరాజు శ్యామ్ కుమార్ శర్మ జ్యోతిష్యంలో విశేష ప్రావీణ్యం సంపాదించినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్(హైదరాబాద్) అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో ఆయన అవార్డు అందుకోనున్నారు. ఈ అవార్డు రావడంపై స్థానిక బ్రాహ్మణ సంఘాలు అభినందనలు తెలియజేశారు.

ఆల్ ఇండియా టోర్నమెంట్‌కు డిగ్రీ కాలేజీ విద్యార్థి



విద్యార్థి సోమేశ్వరరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, అధ్యాపకులు

నర్సీపట్నం : ఆంధ్ర యూనివర్శిటీలో బుధవారం జరిగిన యూనివర్శిటీ బేస్‌బాల్ సెలక్షన్‌లో యూనివర్శిటీ జట్టుకు నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతున్న రావుల సోమేశ్వరరావు సెలెక్ట్ అయ్యాడు. యూనివర్శిటీ టీం తరఫున త్వరలో పంజాబ్‌లో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ బేస్‌బాల్ టోర్నమెంట్‌లో ఆడనున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి సోమేశ్వరరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, అధ్యాపకులు అభినందించారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు కాలేజీ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు.

'డ్రంకెన్ డ్రైవ్'లో ముగ్గురికి జైలు

నక్కపల్లి : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి యలమంచిలి కోర్టు గురువారం నాలుగు రోజుల జైలుశిక్ష విధించినట్టు సీఐ కుమార స్వామి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండురోజుల నుంచి జాతీయరహదారిపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఉపమాకకు చెందిన గొర్ల సువర్ణరాజు, కె.కోటపాడుకు చెందిన మాకిరెడ్డి శ్రీను, నాతవరం మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన గుర్రాల చిన అప్పన్నలు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్టు పోలీసు తనిఖీల్లో గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసి యలమంచిలి ఏజెఎఫ్ కోర్టులో హాజరు పరచగా కోర్టు వీరికి నాలుగు రోజుల జైలుశిక్ష విధించినట్టు సీఐ తెలిపారు.

కట్టుకున్న వాడే.. కాలయముడు

- వీడిన ట్రాన్స్‌జెండర్ హత్య కేసు మిస్టరీ
- అనుమానం, రెండో పెళ్లికి ఒప్పుకోకపోవడంతో ఘాతుకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా (ఇన్‌సెట్) మృతురాలు దీపు

కశింకోట: కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా చంపాడో భర్త. విషయం బయటపడితే జైలుకెళ్లాల్సి వస్తుందని భయపడి మృతదేహాన్ని మూడు ముక్కలుగా కత్తితో కోసి వేర్వేరు చోట్ల పడేశాడు. మీడియాలో వార్తలు రావడంతో పాటు హిజ్రాలు అందించిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కశింకోట పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన బండి దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీ(35) నాలుగేళ్ల కిందట అనకాపల్లికి చెందిన ట్రాన్స్‌జెండర్ దీపు అలియాస్ దిలీప్‌కుమార్(35)ను ఆలయంలో వివాహం చేసుకొని మునగపాక మండలం నాగులాపల్లిలో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దీపు ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆమె ఆభరణాలు కాజేయాలని నిందితుడు భావించాడు. అంతే కాకుండా రెండో వివాహం చేసుకోవాలని యోచించాడు. అందుకు దీపు అడ్డు పడింది. నాలుగైదు రోజులుగా ఈ విషయమై ఇద్దరూ ఘర్షణ పడుతున్నారు. దీంతో దీపును అడ్డు తొలగించుకోవాలని బన్నీ పన్నాగం పన్నాడు. హత్య చేయాలని కత్తి కూడా తెచ్చుకుని సిద్ధం చేసుకున్నాడు. ఈ నెల 17న గొడవ జరగడంతో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో తువ్వాలుతో ఆమె పీక నులిమి హత్య చేశాడు.

మృతదేహాన్ని ముక్కలు చేసి..

హత్య వార్త బయటకు పొక్కకుండా, ఆనవాళ్లు బయట పడకుండా దీపు మృతదేహాన్ని బన్నీ బాత్‌రూంలోకి తీసుకెళ్లి మూడు భాగాలుగా క్రూరంగా కత్తితో కోశాడు. వాటిని అదే రోజు రాత్రి ఒక్కొక్క చోట పడేశాడు. కుడి చేయి, నడుం కింద భాగాన్ని దుప్పట్లో చుట్టి దర్జాగా స్కూటీలో తీసుకెళ్లి మండలంలోని బయ్యవరం వద్ద జాతీయ రహదారి వంతెన కింద పడవేసి వెళ్లిపోయాడు. అలాగే బులెట్‌పై తల భాగాన్ని సంచిలో ఉంచి అనకాపల్లి డైట్ కళాశాల సమీపంలోని కాలువలో పడేశాడు. తాళ్లపాలెంలో జాతీయ రహదారి వంతెన కింద గెడ్డలో మొండెం భాగాన్ని సంచిలో వేసి బుల్లెట్‌పై తీసుకెళ్లి పడవేశాడు. ముందుగా బయ్యవరంలో ట్రాన్స్‌జెండర్ నడుం దిగువ భాగాలు, కుడి చేయి లభ్యం కావడంతో హత్య సంఘటన వెలుగు చూసింది. అవి మహిళ శరీర భాగాలుగా గుర్తించి హత్య కేసు నమోదు చేసి 8 ప్రత్యేక బృందాలను నియమించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌జెండర్ ధరించిన ఆభరణాలు, గుర్తులతో పత్రికలు, మీడియాలో కథనాలు రావడంతో వాటిని చూసిన అనకాపల్లిలోని హిజ్రాలు పోలీసులకు మృతిరాలి ఆచూకి గురించి సమాచారం అందించారు. దీంతో పోలీసులు హత్యకు గురైనది ట్రాన్స్‌జెండర్ దీపుగా నిర్ధారించారు. అనకాపల్లి, తాళ్లపాలెం వద్ద పడవేసిన మృతదేహం మిగిలిన భాగాలను గుర్తించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. 8 పోలీస్ ప్రత్యేక బృందాలతో నిర్వహించిన విచారణలో హంతకుడు బన్నీగా గుర్తించారు. నిందితుడు పరారు కావడానికి ప్రయత్నించగా బుధవారం రాత్రి మండలంలోని విసన్నపేట గ్రామం వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కేసు విషయంలో మరి ఎవరి ప్రమేయం ఉందా? లేదా? అనే విషయమై ముమ్ముందు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి బన్నీయే హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. 24 గంటల్లోగా నిందితున్ని అరెస్ట్ చేశామన్నారు. ఈ సంఘటనలో మృతి చెందిన ట్రాన్స్‌జెండర్ కుటుంబానికి సహాయం అందించడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఘటనలో వాడిన బుల్లెట్, కత్తి, మృతురాలితో పాటు నిందితుడిని సెల్‌ఫోన్లు, సంఘటన స్థలంలో నిందితుడి నగదు, వస్త్రాలు, మృతురాలి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు మిస్టరీని త్వరితగతిన ఛేదించిన డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు, ఇతర సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

అధికలోడుతో బండరాళ్ల రవాణా

- లారీని అడ్డుకున్న గ్రామస్తులు


మునగపాకలో భారీ వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

మునగపాక : ఒకవైపు భారీ వాహనాల రాకపోకలు సాగించొద్దంటూ అధికారులు చెబుతున్నా ఇవేమీ తమకు పట్టనట్లు లారీ యజమానులు వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది. ఒకవైపు పోలీసు ఉన్నతాధికారులు అధికలోడుతో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా కొంతమంది లారీ డ్రైవర్లు అధికలోడుతో లారీలు నడుపుతున్నారు. గురువారం సాయంత్రం అనకాపల్లి నుంచి రాంబిల్లికి మునగపాక మీదుగా అధికలోడుతో బండరాళ్లతో వెళుతున్న లారీని స్థానికులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా అధికలోడుతో బండరాళ్లను ఎలా తీసుకువె వెళతావంటూ డ్రైవర్‌ను చుట్టుముట్టారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా పలువురు గాయాలపాలవుతున్నా ఎందుకు స్పందించడం లేదంటూ స్థానికులు ముసిలినాయుడు, కొండలరావు తదితరులు డ్రైవర్‌ను నిలదీశారు. ఇప్పటికైనా లారీ డ్రైవర్లు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వాహనాలు తిప్పాలని లేకుంటే సహించేదిలేదని హెచ్చరించారు.

అధికలోడు లారీలకు భారీ జరిమానా

అనకాపల్లి(కశింకోట): అధిక లోడ్‌తో వెళుతున్న రెండు క్వారీ లారీలను గురువారం పట్టుకొని పోలీసులు రూ.లక్షా 26 వేల భారీ జరిమానా వసూలు చేశారు. అనకాపల్లి వైపు నుంచి వస్తున్న రెండు లారీలను అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద నిలిపి వాటికి ఒకదానికి రూ.58 వేలు, మరోదానికి రూ.68 వేలు వంతున జరిమానాగా వసూలు చేసినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ తెలిపారు.

27న దేవరాపల్లి ఎంపీపీ ఎన్నిక


మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి: దేవరాపల్లి ఎంపీపీ పదవికి ఈ నెల 27న ఎన్నిక నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండల పరిషత్ అధ్యక్ష పదవి ఎన్నికకు సంబంధించి 23న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. 27న ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరించి, 12 గంటలకు పరిశీలిస్తామన్నారు. ఒంటి గంటలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించి వెంటనే అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. అనంతరం ఒంటి గంటకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభించి పూర్తయిన వెంటనే ఫలితాన్ని ప్రకటిస్తామన్నారు. ఇది ఇలా ఉండగా గతేడాది ఏప్రిల్ 15న ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి రాజీనామా చేశారు. దీంతో అప్పుడు వైస్ ఎంపీపీగా ఉన్న చింతల బుల్లిలక్ష్మిని ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఉన్నతాధికారులు నియమించడంతో ఇప్పటి వరకు ఆమె కొనసాగుతున్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి

- రాజకీయపార్టీలతో డీఆర్వో సమావేశం


ఓటర్ల జాబితాలో సూచనలు, అభ్యంతరాలపై రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల : ఓటరు జాబితాలో సమస్యలు, అభ్యంతరాలు ఉంటే బూత్ లెవెల్ అధికారికి గాని, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి గాని, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా రెవెన్యూ అధికారి వై. సూర్యనారాయణరావు సూచించారు. గురువారం ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటరు జాబితాల సవరణలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో అసెంబ్లీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు, అభ్యంతరాలు, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ కానుక రాజకీయ పార్టీల ప్రతినిధులు జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూలమైన సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బూత్ స్థాయి అధికారుల నియామకం, ఓటరు జాబితాలను నాణ్యతగా తయారు చేసేందుకు, మెరుగుపరిచేందుకు మరింత మంది బూత్ స్థాయి అధికారులు, ఎలక్టోరల్ అధికారుల నియామకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయ పార్టీల నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కె.ఎం.నాయుడు, వి.వి.సంతోష్ కుమార్, గంట శ్రీరాము, మీసాల సుబ్బన్న, మల్లపాటి కోటేశ్వరరావు, హరినాథబాబు పాల్గొన్నారు.

బాలకార్మికులతో పనిచేయిస్తే కేసులు

- ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో రెండు దుకాణాల్లో తనిఖీలు


ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో మెకానిక్ షాపులో తనిఖీ చేస్తున్న చోడవరం సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ

మాడుగుల రూరల్ : బాల కార్మికులతో పనులు చేయిస్తే అటువంటి యజమానులపై కేసులు నమోదు చేస్తామని, చోడవరం సహాయ కార్మిక అధికారి పి. సూర్యనారాయణ అన్నారు. ఘాట్ రోడ్డు జంక్షన్‌లో గల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. శ్రీ విజయలక్ష్మి ఇంజినీరింగ్ వర్కుషాపులో పనిచేస్తున్న బాలకార్మికుడు, క్రేజీ జ్యూస్ సెంటర్‌లో పనిచేస్తున్న మరో బాలకార్మికుడిని ఈ తనిఖీల్లో గుర్తించారు. వారికి తక్కువ జీతం ఇస్తున్నట్టు తెలుసుకున్నారు. కనీస వేతనాల చట్టం 1948 కింద పై అధికారి వద్ద క్లయిమ్‌లకు దాఖలు చేస్తామని, 18 సంవత్సరాలు వయస్సు నిండని బాలలు చేత పని చేయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర ఉత్పత్తులు


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న పీడీ లచ్చన్న

తుమ్మపాల : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు వినియోగం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ అధికారి సిహెచ్.లచ్చన్న అన్నారు. పట్టణంలో జీవీఎంసీ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాచురల్ ఫార్మింగ్ వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, ఆకుకూరలు స్టాల్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఉత్పత్తులను వినియోగించడం వల్ల ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా, బీపీ షుగరు గుండుపాటి వంటి వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి వర్మ, జిల్లా కోఆర్డినేటర్ గోవింద్, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ అప్పలరాజు, మోడల్ మేకర్స్, పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడ్డ శేషుబాబు

రావికమతం : పొలం మధ్యలోని పంటను ట్రాక్టర్‌తో తొక్కించుకెళ్లి పాడు చేయడంపై రైతుల మధ్య వివాదం తలెత్తి కొట్లాటకు దారితీసింది. ఇరు వర్గాలకు చెందిన రైతులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపిన వివరాలివి. మేడివాడకు చెందిన కేశంశెట్టి గణేష్, సీతిన చిరంజీవికి చెందిన వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. గురువారం సీతిన చిరంజీవికి చెందిన ట్రాక్టర్‌ను కేశంశెట్టి గణేష్ పొలంలోంచి తీసుకెళ్లి దాంట్లోని పంటను పాడు చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సీతిన చిరంజీవి, సీతిన సంజీవి, సీతిన శ్రీను కర్రలు, కత్తులతో గణేష్, అతడి సోదరుడు శేషుబాబుపై దాడి చేశారు. ఈ దాడిలో గణేష్, శేషుబాబు తలపై బలమైన గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ రావికమతం పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. చిరంజీవి, అతని సోదరులుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘువర్మ తెలిపారు.

పునరావాసం కల్పించి పనులు చేపట్టండి

- బార్క్ పనులు అడ్డుకున్న రావిపాలెం గ్రామస్తులు
- మద్దతు తెలిపిన జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు కుమార్


ప్రహరీ నిర్మాణ పనులు అడ్డుకుంటున్న జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు కుమార్, రైతులు

అచ్యుతాపురం రూరల్ : రావిపాలెంభూముల్లో తలపెట్టిన బార్క్ నిర్మాణ పనులను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు పునరావాసం కల్పించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిపాలెం నిర్వాసిత భూసమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తరుణంలో రైతుల భూముల్లో పొక్లెయిన్‌తో పనులు చేపట్టడం అన్యాయమన్నారు. రావిపాలెం చుట్టూ ఉన్న భూములన్నీ పోతున్నాయని, ఊరు మాత్రమే మిగిలిపోతోందన్నారు. గ్రామం చుట్టూ ప్రహరీ నిర్మించడం వల్ల అన్ని వర్గాల ప్రజలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. అధికారులు స్పందించి గ్రామాన్ని తరలించి న్యాయం చేయాలని కోరారు. నేటికీ నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా రావిపాలెం రైతులపై అచ్యుతాపురం డీటీ దౌర్జన్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కలెక్టర్ స్పందించి రావిపాలెంలో గ్రామసభ నిర్వహించి సమస్యలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

రావికమతం: ఏజెన్సీ నుంచి తరలిస్తున్న 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశామని కొత్తకోట ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు, ఏజెన్సీ ప్రాంతం జామిగూడకు చెందిన మరో వ్యక్తి గురువారం లగేజీ బ్యాగుల్లో పది కేజీల గంజాయితో వడ్డాది మీదుగా నర్సీపట్నం వైపు ప్రయాణికులతో ఉన్న ఆటోలో వెళ్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు దొండపూడి చెక్‌పోస్టు వద్ద మాటు వేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దొండపూడి వీఆర్వో మూర్తి, కొత్తకోట పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో పట్టుబడిన వాహనం దగ్ధం

నర్సీపట్నం : నర్సీపట్నం ఎక్సైజ్ పోలీసులు గంజాయి కేసులో సీజ్ చేసిన వాహనం దగ్ధమైంది. సీజ్ చేసిన వాహనాన్ని స్టేషన్‌కు సమీపంలో చింతపల్లి వెళ్లే మెయిన్ రోడ్డు పక్కన వాహనాన్ని పార్కు చేశారు. చుట్టుపక్కల వారు చెత్తాచెదారం వాహనం దగ్గరే వేయడం వల్ల దారిన వెళ్లే వారు విసిరేసిన అగ్గిపుల్లతో చెత్తరాజుకుని వాహనానికి మంటలు వ్యాపించాయి. ఎక్సైజ్ పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ స్వామి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో సమీపంలో ఉన్న వాహనాలకు ముప్పు తప్పింది.

పాత గొడవలతో వ్యక్తిపై కత్తితో దాడి


అనకాపల్లి వందపడకల ఆసుపత్రిలో తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న తాతబాబు

మునగపాక : మండలంలోని గొల్లలపాలెంలో గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన పక్కుర్తి నూకరాజుకు అదే గ్రామానికి చెందిన శీరా తాతబాబుకు గతంలో పాత గొడవలు ఉండేవి. దీనిలో భాగంగా గురువారం రాత్రి ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో పక్కనే ఉన్న కల్లుగీత కార్మికునికి చెందిన కత్తితో తాతబాబుపై నూకరాజు దాడి చేశాడు. ఈ సంఘటనలో తాతబాబుకు తీవ్రగాయాలు కావడంతో అతనిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన నూకరాజు కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ మేరకు హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లుపాకల వద్ద వ్యక్తి మృతి


కల్లుపాకల వద్ద రాముమృతదేహం

నక్కపల్లి: మండలంలో నల్లమట్టిపాలెంకు చెందిన నల్లమట్టిరాము(54) అనే వ్యక్తి కల్లుపాకల వద్ద అనుమానాస్పదంగా మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లమట్టిపాలెం గ్రామానికి చెందిన రాముకు మద్యం సేవించే అలవాటు ఉంది. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన రాము సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న రాజయ్యపేట శివారులో నిర్వహిస్తున్న కల్లుపాకల వద్దకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం కుటుంబ సభ్యులు ఇతని కోసం వెతికారు. రాజయ్యపేట సమీపంలో ఉన్న కల్లుపాకల వద్ద శవమై కనిపించాడు. విపరీతంగా కల్లు సేవించడం వల్ల చనిపోయాడా, లేక మరేదైనా కారణం వల్ల చనిపోయాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో దువ్వాడ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్లలో డీఆర్ఎం లలిత్ బోరా సీనియర్ అధికారులతో కలిసి గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆయా స్టేషన్లలో జరుగుతున్న స్టేషన్, యార్డ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం దువ్వాడ నుంచి నౌపడ వరకు గల పలు కీలక ప్రాంతాలు, యార్డుల్లో విండో ట్రయలింగ్ ఇన్‌స్పెక్షన్ కూడా చేపట్టారు. పర్లాకిమిడి, నౌపడ స్టేషన్లలో అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న స్టేషన్ డెవలప్‌మెంట్ పనులను పరిశీలించారు.

మే ఫెయిర్‌కు భూమి కేటాయింపు

విశాఖ సిటీ: విశాఖ జిల్లాలో రిసార్ట్స్ కోసం ప్రభుత్వం భూమిని కేటాయించింది. మే ఫెయిర్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు 40 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి భీమిలి మండలం అన్నవరం గ్రామంలో స్టార్ హోటల్, రిసార్ట్స్ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం జరిగింది. ఇక్కడ మే ఫెయిర్‌తో పాటు ఒబెరాయ్ హోటల్స్, రిసార్ట్స్ రానున్నాయి. వీటితో మే ఫెయిర్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు అన్నవరం గ్రామంలో సర్వే నెంబర్ 109, 110లలో 40 ఎకరాలను కేటాయించింది. పీపీపీ విధానంలో మే ఫెయిర్ సంస్థ ఇక్కడ విల్లాల తరహాలో రిసార్టుల నిర్మాణం చేపట్టనుంది.

క్యాష్ కొట్టు.. స్టాఫ్ నర్స్ పోస్టు పట్టు

- నర్సింగ్ పోస్టులకు కూటమి నాయకుల బేరాలు
- పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూళ్లు
- రెండు రోజుల్లో మెరిట్ జాబితా.. 31లోగా తుది జాబితా



మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో పైరవీలు జోరందుకున్నాయి. ఈ పోస్టులను కూటమి నేతలు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వంత పాడుతూ పైరవీలకు తెరతీస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ అనుకూలురికి పోస్టులు కట్టబెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్‌డీ) మీద తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు సిఫార్సుల లేఖలు, మరో వైపు ప్రజాప్రతినిధులు, వారి పీఏలు ఫోన్లు మీద ఫోన్లతో ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం.

బేరసారాలు : ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 106 స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఏడాది కాలానికి కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. 8,309 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు 88 మంది చొప్పున పోటీ నెలకొనడంతో కూటమి నేతల పంట పండినట్లయింది. ఒక్కో పోస్టు కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డీ ఆధ్వర్యంలో ప్రొవిజనల్ జాబితా మీద వచ్చిన 1,530 అభ్యంతరాల వడపోత కార్యక్రమం జరుగుతోంది. రెండు రోజుల్లో మెరిట్ జాబితా వెల్లడికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 31 లోపు రోస్టర్ ప్రకారం పోస్టులను భర్తీ చేయాలని అధికారులు కసరత్తు చేపట్టారు.

రంగంలోకి దళారులు : మరోవైపు దళారులు కూడా రంగంలోకి దిగారు. దరఖాస్తుదారుల్ని మాయ మాటలు చెప్పి నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇవ్వడంతోపాటు, కార్యాలయ సిబ్బందితో బేరాలకు దిగుతున్నారు. కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారు. వారి ద్వారా పోస్టులకు ధర నిర్ణయిస్తున్నారు. వీరు కూడా పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులోనూ అడ్వాన్స్ ముడుపులిచ్చేవారికే పోస్టింగ్ అంటూ నమ్మబలుకుతున్నారట.

దళారులను నమ్మొద్దు



పోస్టుల భర్తీ మెరిట్ ప్రకారమే జరుగుతుంది. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. అర్హత ప్రమాణాలు, మెరిట్, రోస్టర్ ప్రకారం ప్రాథమిక ఎంపిక జాబితా సిద్ధం చేస్తున్నాం. దీనిపై కూడా అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించాకే తుది ఎంపిక జాబితాను వెల్లడిస్తాం.

– డాక్టర్ రాధారాణి, ఆర్‌డీ, వైద్య ఆరోగ్యశాఖ

క్లుప్తంగా

ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్



భూములను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్: ల్యాండ్ పూలింగ్ భూమిపై వెంటనే దర్యాప్తు పూర్తి చేసి లబ్ధిదారులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని కుంచంగి, కూండ్రం రొగలివానిపాలెం గ్రామాల్లో లోకనాథం తదితర బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐడీ దర్యాప్తు పేరుతో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సార్యం చేస్తున్నారన్నారు. వాస్తవానికి అధికారులు లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని వాపోయారు. సంవత్సరానికి 60 వేల రూపాయల నుంచి రెండు లక్షల వరకు జీడి తోటల ద్వారా ఆదాయం వచ్చేదని, వాటిని తొలగించడం ద్వారా తీవ్రంగా రైతులు నష్టపోయారన్నారు. ఇప్పటికైనా దర్యాప్తును వెంటనే పూర్తి చేసి నిందితులపై చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో త్రిమూర్తులు, పి. మురళీ, పి. శాంతికుమారి, బి. జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తాగునీటి కనెక్షన్లపై చర్యలు



అక్రమ కనెక్షన్లను పరిశీలిస్తున్న కార్యదర్శి ప్రసాద్

మాకవరపాలెం: అక్రమంగా తాగునీటి కనెక్షన్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని మల్లవరం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ స్పష్టం చేశారు. గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించే పైపులైన్ల ద్వారా అక్రమంగా కనెక్షన్లు ఇళ్లలోకి అమర్చుకోవడంతో గ్రామంలో పూర్తిస్థాయిలో ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ కనెక్షన్లపై అందిన ఫిర్యాదుతో గురువారం కార్యదర్శి ఇంటింటికీ వెళ్లి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కనెక్షన్లను పరిశీలించారు. కొందరు వ్యవసాయ భూములకు పైపుల ద్వారా తాగునీటిని మళ్లించిన విషయాన్ని కూడా గుర్తించారు. అక్రమ కనెక్షన్లు వెంటనే తొలగించి, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మంగళవరపుపేటకు చెందిన మొల్లేటి ఆదినారాయణ జ్ఞాపకార్థంగా భార్య లక్ష్మీ సోమేశ్వరమ్మ, కుమారుడు వేంకట సూర్య పెంటారావు తమవంతు విరాళంగా రూ.51,116 కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు.

పచ్చగడ్డి నోట్లో పెట్టుకుని వినూత్న నిరసన

ఎస్.రాయవరం: 'తిండైనా పెట్టండి.. చేసిన పనికి డబ్బులైనా ఇవ్వండి' అని పచ్చగడ్డి నోటిలో పెట్టుకుని ఉపాధి కూలీలు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వమ్మవరం, పి.ధర్మవరం గ్రామాల్లో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 4,336 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,890	4,180
మొదటి రకం	3,110	4.885
రెండో రకం	3,170	3,500
మూడో రకం	2,910	3,035

అనకాపల్లి సినిమాలు

రాజా :	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-1:	టుక్‌టుక్
సత్యనారాయణ స్క్రీన్-2:	యుగానికి ఒక్కడు
పర్తిసాయి	: కోర్ట్
షిర్డీసాయి	: పెళ్లికాని ప్రసాద్
వెంకటేశ్వర(ఉదయం)	: షణ్ముక
వెంకటేశ్వర(మ్యాట్నీ, 1,2 షోలు):	న్యూ పోలీస్ స్టోరీ
శ్రీసత్య	: సలార్
రామచంద్ర	: ఛావా

సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యపు నీడ



అస్తవ్యస్తంగా ఉడ్‌పేట సచివాలయం బోర్డు

సచివాలయ వ్యవస్థ రాకతో ప్రజలకు రాజ వైభోగమే... కాళ్లు కదపకుండా గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు హాయిగా పొందే వారు. నిరక్షరాస్యులైన ఎంతోమందికి వ్యయప్రయాసలు ఉండేవి కావు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి అధికారంలోకి రాగానే వీరి పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. 2019కి ముందు నాటి కష్టాలు మళ్లీ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా సిబ్బంది హాజరు

నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం ఎత్తుగడలు

అరకొరగా అందుతున్న సేవలు

మొదటికొచ్చిన ప్రజల కష్టాలు

అనకాపల్లి టౌన్: ప్రజలే ప్రభువులు, ప్రజల వద్దకే పాలన, గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయాలు నాడు కళకళలాడగా, నేడు వెలవెలబోతున్నాయి. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయాలపై ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణిని క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే అర్థమవుతోంది. 2019కి ముందు ప్రజలకు ఏ చిన్నపాటి ప్రభుత్వ సేవలు కావాలన్నా, మండల కేంద్రాలకు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగే వారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన వెంటనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చింది. తద్వారా ప్రజలకు నేరుగా సేవలందించింది. దీనిపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

పట్టణ పరిధిలో 27 సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రతీ సచివాలయంలో అడ్మిన్, డేటా ప్రాసెసర్ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎమినిటీస్, ప్లానింగ్ సెక్రటరీ, శానిటేషన్ ఎన్విరామెంట్ సెక్రటరీ, వీఆర్‌వో, హెల్త్ సెక్రటరీ, మహిళా పోలీస్ ఇలా తొమ్మిది మంది సిబ్బందిని నియమించింది. వీరి ద్వారా ప్రజలకు సుమారు 150 సేవలందించేలా చర్యలు చేపట్టింది. విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్లు, రెవెన్యూ రికార్డులలో మార్పులు చేర్పులు, ఆధార్ సేవలు, ఇళ్ల నిర్మాణ దరఖాస్తు, పింఛన్లు, భూముల రిజిస్ట్రేషన్, ఇలా అనేక సేవలు నామమాత్రపు రుసుంతోనే నిరంతరాయంగా సేవలందించే వారు. ఇక వలంటీర్లు ఇంటింటికి వచ్చి ఎవరూ కాలు కదపకుండా సేవలందించేవారు. ప్రభుత్వం మారగానే ఒక్కసారిగా పరిస్థితులు తలకిందులయ్యాయి.

ప్రస్తుతం సచివాలయాల ద్వారా రైస్ కార్డు, హౌస్ హోల్డ్ స్లిప్టింగ్, నూతన పింఛన్లు, చంద్రన్న బీమా క్లైయిమ్స్, ఆరోగ్యశ్రీ ఈసీ, సీసీ, రిజిస్ట్రేషన్, తదితర ముఖ్యమైన సేవలు అందడం లేదు. 2019కి ముందు కష్టాలే మళ్లీ మొదలయ్యాయయని ప్రజలు వాపోతున్నారు.



ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సేవలు తెలిపే బోర్డు



ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయం

సగానికి తగ్గనున్న సచివాలయ కేంద్రాలు..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుతంత్రంతో గ్రామ/వార్డు సచివాలయాల్లోని సేవలను తగ్గిస్తూ వస్తోంది. సచివాలయాలను గతంలో పట్టణాల్లో సుమారు 3500 నుంచి 5000 జనాభాకు ఒకటి ఏర్పాటు చేశారు. ఇప్పుడు రెట్టింపు జనాభాకు ఒకటి చొప్పున కేటాయించారు. దీంతో ఇప్పుడున్న సచివాలయాల సంఖ్య సగానికి తగ్గనుంది. దీనిపై పట్టణ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండగా, ఇటు ఉద్యోగుల్లోనూ నిర్లిప్తత కనిపిస్తోంది. ప్రస్తుతం ఏ సర్టిఫికెట్ కావాలన్నా ఒకటికి పదిసార్లు తిరగాల్సి వస్తోంది. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు, విద్యార్థులకు కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదని వాపోతున్నారు.

మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది



గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరిగేది. ఇంటింటికి వచ్చి సేవలందించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతీ దానికి ఒకటికి పదిసార్లు సచివాలయానికి, మరలా మండల కార్యాలయాలకు తిరగాల్సి వస్తోంది.

– ఎం. బంగార్రాజు, అనకాపల్లి

మళ్లీ మొదటికొచ్చిన కష్టాలు..



సచివాలయాలు పెట్టక ముందు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే వేలకు వేలు డబ్బులు అనధికార వ్యక్తుల ద్వారా చెల్లించి పొందేవారం. సచివాలయ వ్యవస్థ పెట్టిన తర్వాత ఉచితంగా వలంటీర్లు ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. దీనివల్ల ఎందరో పేదలు లబ్ధి పొందారు. ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

–టి గీత, అనకాపల్లి

చూడముచ్చటగా.. రంగుల కోడి పిల్లలు



కశింకోట వారపు సంతలో విక్రయిస్తున్న రంగుల కోడి పిల్లలు

కశింకోట: స్థానిక వారపు సంతలో రంగు రంగుల కోడి పిల్లలు చూడముచ్చటగా ఆకట్టుకున్నాయి. విజయవాడ వద్ద గన్నవరం నుంచి వీటిని గురువారం ఇక్కడకు తీసుకువచ్చి విక్రయించారు. వివిధ రంగుల్లో అందంగా ఉన్న వీటిని ఆసక్తిగా ప్రజలు కొనుగోలు చేశారు. బ్రాయిలర్, ఇతర రకాల కోడి పిల్లలను బుట్టల్లో తెచ్చి అమ్మకానికి పెట్టారు. ఇవి కోడిగుడ్డు కంటే కాస్త ధర మాత్రమే ఎక్కువగా ఉన్నాయి. ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయించారు. ప్రతి సంతల్లో తిప్పి కోడి పిల్లలను విక్రయిస్తుంటామని, ఇదే తమ కుటుంబానికి జీవనాధారమని అమ్మకందారుడు పామర్తి రామచంద్రరావు 'సాక్షి'కి తెలిపారు. ఇవి త్వరగా ఎదుగుతాయని, వేసవి కాలం వీటి పెంపకానికి అనువైనదన్నారు. విద్యుత్ ద్వారా గుడ్లను కృత్రిమంగా పొదిగించి పిల్లలను ఉత్పత్తి చేస్తారని, ఆనక రంగులు వేసి విక్రయానికి అందిస్తారన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని జీవీఎంసీ మెయిన్ హైస్కూల్‌లో పోషణ్ బీ, పడాయిబీలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు విద్య, పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. నవ చేతన, ఆధార్ శీల, బాల సంరక్షణలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో డి. లక్ష్మి, వి. సుచరిత, కె. నిర్మలా కుమారి, జి. వెంకటలక్ష్మి, సిహెచ్ కృష్ణవేణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలి

తుమ్మపాల: మండలంలో బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన లేజర్ స్క్రీన్ థియేటర్‌లో లేజర్ షో, హరిత రిసార్ట్‌లో ఫుడ్ కోర్ట్ (క్యాంటీన్)ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ సభ్యులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్వో వైఎస్ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ జిల్లాకు మణిహారం లాంటి బొజ్జన్నకొండ అభివృద్ధికి ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసి చేపట్టిన నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయని వాపోయారు. బొజ్జన్నకొండ చరిత్ర, విశిష్టత, ప్రాముఖ్యతలను తెలిపే లేజర్ స్క్రీన్ థియేటర్‌ను పర్యాటకులకు అందించాలని కోరారు. అన్ని సౌకర్యాలు కల్పించడం ద్వారా నిత్యం పర్యాటకుల సందడి పెరుగుతుందన్నారు. జిల్లా కేంద్రం పరిసరాలలోని పురాతన బొజ్జన్నకొండ అభివృద్ధిపై ఎంపీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలన్నారు. ఇక్కడ హరిత రిసార్ట్, లేజర్ షో థియేటర్‌ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా, నేటికి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు బండి అప్పారావు, పి.దయాల్‌రాజ్ పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న బల్లా నాగభూషణం

వారపు సంతకు ఎండ దెబ్బ



మండు టెండలో గొడుగులు వేసుకొని అమ్ముతున్న కూరగాయలు



ఎండ తీవ్రత తగ్గడంతో సాయంత్రం ముమ్మరంగా సాగుతున్న సంత

కశింకోట: స్థానిక వారపు సంతకు ఎండ తీవ్రత దెబ్బ తప్పలేదు. సూర్య తాపంతో మధ్యాహ్న సమయంలో సంత వెలవెలబోయింది. 36 డిగ్రీల సెల్సియస్ మేర ఎండ తీవ్రత ఉన్నట్లు గూగుల్‌లో నమోదు అయింది. ఎండకు జడిసి కొనుగోలుదారులు మధ్యాహ్నం 11 నుంచి 3 గంటల ప్రాంతం వరకు రాలేదు. ఏదో అరకొరగా వచ్చి కొనుగోలు చేశారు. ఎండ కావడంతో కొందరు గొడుగులు వేసుకొని అమ్మకాలు సాగించగా, మరికొందరు ఎండ తీవ్రతతో నీడ పట్టుకు చేరుకున్నారు. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో ముమ్మరంగా సంత సాగింది. కూరగాయలు, ఆకుకూరలు, మసాలా దినుసులు, చేపలు, వస్త్రాలు వగైరా కొనుగోలు చేశారు. కూరగాయల ధరలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయి. కిలో టమాటా రూ.20, ఉల్లి, బంగాళదుంప, దొండకాయ రూ.30, క్యారెట్, బీట్రూట్, చామదుంప రూ.40, కాకరకాయ, చిక్కుడు రూ.60, బీరకాయ రూ.80 అమ్మకాలు సాగాయి.

సమాజానికి ఆరోగ్యకరమైన బాలలే లక్ష్యం

ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి



బయ్యవరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి

కశింకోట: ఆరోగ్యకరమైన బాలలను సమాజానికి అందివ్వాలనే లక్ష్యంతో 'పోషణ్ భీ-పఢాయి భీ' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, దీన్ని సద్వినియోగం చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి తెలిపారు. మండలంలోని బయ్యవరం హైస్కూలులో నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ-పఢాయి భీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలకు పోషకాహారం అందించడంతోపాటు ఆటపాటలతో నాణ్యమైన విద్యను అందించడానికి కార్యక్రమం జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో బోధించిన అంశాలను ఆకళింపు చేసుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీవో టి. శశికళ, సూపర్ వైజర్లు ఎం. ఝాన్సీరాణి, సిహెచ్. వంశీప్రియ, జి.కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఉచిత ఎంసెట్ కోచింగ్

నర్సీపట్నం: ఎస్ఏఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, చారిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నామని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఉమామహేశ్వరి, ఆర్గనైజర్ కృష్ణ తెలిపారు. ఈ నెల 24 నుంచి నర్సీపట్నం మున్సిపాలిటీ రామారావుపేటలో తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91823 96247, 94932 95638 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

చెరువు గట్లనూ వదిలి పెట్టడంలేదు..



అక్రమ తవ్వకాలతో సన్నబడిన సుర్లవానిపాలెం చెరువు గట్టు

కోటవురట్ల: అక్రమార్కులు మట్టి, గ్రావెల్, ఇసుక.. ఇలా దేనినీ వదిలి పెట్టడంలేదు. ఉచితం ఏదైనా కనిపిస్తే చాలు.. దొరికినంతా దోచేస్తున్నారు. కొండలను కొల్లగొట్టి గ్రావెల్, వరాహనదిని చీల్చి ఇసుకను దోచేస్తుండగా, మట్టి కోసం చెరువులను వదిలి పెట్టడంలేదు. పాములవాక శివారు సుర్లవానిపాలెం గ్రామానికి సంబంధించిన చెరువు గట్టు మట్టిపై ఓ టీడీపీ నేత కన్ను పడింది. అంతే ఏమాత్రం జంకకుండా గట్టును తవ్వేసి మట్టిని తరలించుకుపోయాడు. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 15 అడుగుల వెడల్పున గట్టును పటిష్టం చేయగా, సదరు వ్యక్తి చెరువు చుట్టూ ఉన్న గట్టును సన్నగా తవ్వేసి భారీగా మట్టిని తరలించుకుపోయాడు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. అధికారం అండతో ఇటువంటి పనులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవాలి



చౌడువాడలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ముత్యాలనాయుడు

కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు ఈ నెల 21న ఫ్యాక్టరీ వద్ద సభ్య రైతులతో కలిసి నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు కోరారు. చౌడువాడ, మల్లంపాలెం, పైడంపేట, గొండుపాలెం గ్రామాల్లో గురువారం పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీని నష్టాల పేరు చెప్పి కారుచౌకగా కొట్టేసేందుకు కూటమి నాయకులు గెద్దల్లాగ చూస్తున్నారని ఆరోపించారు. మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో ఫ్యాక్టరీ ఆధునికీకరణ, చెరకు బకాయిలపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫ్యాక్టరీని కాపాడతామని చెప్పి ఓట్లేయించుకున్న ఎంపీ సీఎం రమేష్ ప్రస్తుతం రైతులకు ఎక్కడా కనిపించడం లేదని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా దేముడు, గండి నాయినిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తుమ్మపాల: ప్రభుత్వ సర్క్యులర్ (1/19)కు విరుద్ధంగా సస్పెండ్ చేసిన డ్రైవర్ ఎంఏ రావు, కండక్టర్ ఎస్ఎస్ నారాయణలను వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ సెక్రటరీ జి.శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులు చేస్తున్న 20వ రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సస్పెండ్ చేసిన ఉద్యోగును విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమం తీవ్ర తరం చేస్తామన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 25న చలో డీఎంవో అనకాపల్లికి ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జోనల్ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 19, 20 తేదీల్లో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై మధ్యాహ్న భోజన విరామ సమయంలో గేట్ వద్ద ధర్నా నిర్వహించినట్లు రీజనల్ సెక్రటరీ పి.సుధాకర్ తెలిపారు. దీక్షలో ఎంజే పీకే రావు, కేఎస్ రాజు, పీఏ రావు, పీఎస్ రావు కూర్పొగా, కేవీ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల నోటి శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారి మనీషా



నోటి పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

కశింకోట: విద్యార్థులు నోటి శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎ. మనీషా కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నోటి పరిశుభ్రత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోటిలో దంతాలకు రోజుకు రెండు దఫాలు బ్రష్ చేసుకోవాలన్నారు. అతిగా వేడి, చల్ల పదార్థాలను తీసుకోకూడదన్నారు. క్యాన్సర్ రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. హానికరమైన పొగాకు, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి పదార్థాలను వినియోగించరాదన్నారు. నోటి పరిశుభ్రతపై అవగాహన కలిగిస్తూ విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి. గ్రేస్, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, ఆరోగ్య, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి రాంకీ ఫౌండేషన్ సహకారం



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

పరవాడ: రెడీమేడ్ గార్మెంట్స్ తయారీలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ముందుకు వస్తే, సాంకేతిక సహకారం అందించేందుకు రాంకీ ఫౌండేషన్ సిద్ధంగా ఉందని ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ తెలిపారు. రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో స్థానిక సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెడీమేడ్ గార్మెంట్స్ మేకింగ్‌పై నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ముందుకొస్తే సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు ఫౌండేషన్ సిద్ధంగా ఉందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. సాధన స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పైల గోపాలకృష్ణ, కోఆర్డినేటర్ డి.నాగమణి, కోశాధికారి కె.బి.కన్నారావు, డి.లక్ష్మి పాల్గొన్నారు.